## సిరీస్ ఇండియా కైవసం

మడత పెట్టేసిన భారత్ బౌలర్లు



3లో



RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 10 -03 - 2024

సంపుటి: 1 | సంచిక : 291 | పేజీలు : 4 | వెల : 5/-





## గురు లేదా శుక్రవారం

### లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల?

న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు : వచ్చే గురు లేదా శుక్రవారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరిశీలన కోసం కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం జమ్మూకశ్మీర్‌కు వెళ్లనుంది. సోమవారంనుంచి బుధవారం కేంద్ర ఎన్నికల బృందం జమ్ముకశ్మీర్‌లో పర్యటించనుంది. బుధవారం జమ్ముకశ్మీర్ పర్యటన ముగియగానే గురు లేదా శుక్రవారం ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి

మిగతా 2వ పేజీలో...

# ఆర్టీసీకి పీఆర్సీ

- ఉద్యోగులకు శుభవార్త అందించిన ప్రభుత్వం
- 21 శాతం ఫిట్‌మెంట్ పీఆర్సీ ప్రకటిస్తూ కీలక నిర్ణయం
- ఆటో కార్మికులకు కొంత అన్యాయం జరిగింది.. వారిని ఆదుకుంటాం..
- శవాల మీద పేలాలు ఏరుకునే విధంగా మాజీ మంత్రులు
- ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు కృతజ్ఞతలు: మంత్రి పొన్నం



హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో రెండు గ్యారంటీ స్కీమ్స్ అమలు చేసిన సర్కార్.. ఇటీవల పేదలకు ఎంతగానో ఉపయోగపడే రూ.500 కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేసింది. తాజాగా ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. పీఆర్సీ ప్రకటించింది. 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూన్ 1 నుంచి కొత్త ఫిట్‌మెంట్ అమలులోకి వస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్త ఫిట్‌మెంట్‌తో ఆర్టీసీకి నెలకు రూ.35 కోట్ల భారం పడనుందని చెప్పారు. 53,071 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు మహాలక్ష్మి పథకం అమలుకు సిద్ధమయ్యారని... విజయవంతం చేశారని కొనియాడారు. 3 నెలల్లో 25కోట్ల మహిళలు ఇప్పటి వరకు ప్రయాణం చేశారన్నారు. అందుకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు

మిగతా 2వ పేజీలో...



## ఐటీఐల్లో టాటా స్కిల్స్!

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : సచివాలయంలో టాటా టెక్నాలజీస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలలో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల (స్కిల్లింగ్ సెంటర్లు) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో టాటా గ్రూప్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. సంబంధిత ఎంవోయూ పత్రాలపై అధికారులు సంతకాలు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీసెంటర్లుగా అప్ గ్రేడ్ చేయనుంది టాటా టెక్నాలజీస్ లిమిటెడ్. ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కొత్త ప్రాజెక్టును చేపడుతున్న టాటా టెక్నాలజీస్ 9 లాంగ్ టర్మ్, 23 షార్ట్ టర్మ్ కోర్సులతో పాటు నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించే బ్రిడ్జి కోర్సులను నిర్వహిస్తుంది. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రాజెక్టు అమలుకు సన్నాహాలు చేస్తోంది

మిగతా 2వ పేజీలో...

## సింగిల్‌గానే పోటీ!

- తేల్చిచెప్పిన బీఎస్పీ అధినేత్రి మాయావతి
- బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తు ఆశలు గల్లంతు



న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు : లోక్‌సభ ఎన్నికలపై బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి కీలక ప్రకటన చేశారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆమె ప్రకటించారు. దీంతో థర్డ్ ఫ్రంట్, ఇతర పార్టీలతో పొత్తులపై సాగుతున్న ఊహాగానాలకు తెరదించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా మాయావతి ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ

మిగతా 2లో...

# అంతా పద్ధతే.. మొదటినుంచి అంతే!

- కోదండరాం, అమీర్ అలీఖాన్ ఎంపిక లాంఛనమే
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై త్వరలో నిర్ణయం




హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : రేవంత్ ముఖ్యమంత్రి కావడం ఇష్టం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉండటం నచ్చడం లేదు. అందుకే ఓ సెక్షన్ మీడియా కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌ను రేవంత్ కావాలని బద్నాం చేశాడని విమర్శలు చేస్తున్నది. రకరకాల కథనాలు వండి వారుస్తున్నది.. డిబేట్లకైతే లెక్కేలేదు. కానీ ఇక్కడే మర్చిపోతున్న, విస్మరిస్తున్న విషయం ఒకటుంది. హైకోర్టు ఇలా తీర్పు ఇస్తుందని రేవంత్ రెడ్డి, ఇతర ప్రభుత్వ ముఖ్యులకు ఓ అంచనా ఉంది. కాకపోతే దాని కంటే ముందు వారు గవర్నర్‌కు గౌరవం ఇచ్చారు. "మీ ఆదేశాల ప్రకారం" అంటూ.. విన్నవించారు. అందుకే ఆమె ప్రభుత్వ కేబినెట్ నిర్ణయాలను ఆమోదిస్తుందని భావించారు. అందువల్లే కదా కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీ ఖాన్‌ను ఎమ్మెల్సీలుగా నియమించాలని నిర్ణయం తీసుకొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గవర్నర్ ఆమోదముద్ర కోసం పంపింది. విభేదాలు లేవు గవర్నర్ కూడా

మిగతా 3లో...




మోదీ.. గజవాహన సేవ!

3లో





'ఇందిరమ్మ' ఇంటికి కట్టుబాట్లు!

మార్గదర్శకాలు సిద్ధం చేసిన సర్కారు

4లో


## ఏనుగు దంతాలు రూ.8 కోట్లు



బెంగళూరు – ప్రభాతసూర్యుడు : బెంగళూరులో ఏనుగు దంతాలతో వెళుతున్న వాహనాన్ని డిఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. బెంగళూరు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ యూనిట్‌కి చెందిన అధికారులు ఏనుగు దంతాలను అక్రమంగా తరలిస్తున్న వాహనంను తనిఖీ చేశారు.. ఈ ఘటనలో మొత్తం ఏడుగురు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా బెంగుళూరు శివారు ప్రాంతాల్లో తిరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఒక ఆటోలో ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్న క్రమంలో ఒక సమాచారంతో ఈ వాహనాన్ని డిఆర్ఐ అధికారులు తనిఖీ చేశారు. ఆటోలో ఒక బ్యాగ్‌లో ఏనుగు దంతాలను దాచి వీరు ప్రయాణిస్తున్నారు. రెండు ఏనుగు దంతాలను ఒక పెద్ద బ్యాగులో దాచి బ్యాగును సీటు వెనకాల

మిగతా 2లో...

# దారుణ మోసం!

- హైదరాబాద్‌లో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ల దగా
- వినియోగదారుల పేరిట రూ.2.84కోట్లు కాజేత



హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : ఇద్దరు ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్లు కుమ్మక్కయ్యారు. వినియోగదారుల పేరుతోనే రుణాలు మంజూరు చేశారు. వారికి తెలియకుండానే మంజూరైన కోట్ల రూపాయలను దర్జాగా ఖాళీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో.. అవాక్కైన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. రామంతపూర్ లోని ఎస్‌బీఐ బ్యాంక్ లో భగీరథ గంగ మల్లయ్య మేనేజర్‌గా గతేడాది జులై 27 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు పని చేశారు ఇదే సమయంలో షేక్ సైదులు ఎస్‌బీఐకి సంబంధించిన సీసీజీ బ్రాంచ్ లో మేనేజర్ గా పనిచేసేవాడు. వీరిద్దరూ కలిసి 19 మంది వినియోగదారుల రుణాలను నొక్కాశారు. ఎవరైతే వ్యక్తిగత రుణాలు కావాలని బ్రాంచ్‌కు వస్తారో వారి వద్ద నుండి రుణాలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ ను తీసుకుంటారు. అనంతరం వారు అర్హులు కాదని అక్కడి నుండి పంపించేస్తారు. అనంతరం వారి పేర్ల మీద రుణాలు పొంది, ఖాతాదారులకు తెలియకుండానే 2.8 కోట్ల రూపాయలను కాజేశారు ఇద్దరు మేనేజర్లు. దీంతో అనుమానం వచ్చిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టడంతో

మిగతా 2లో...

## కాపుల కోసం జగన్ మాస్టర్ ప్లాన్

విజయవాడ, ప్రభాతసూర్యుడు : కాపు సీనియర్ నేతలపై వైసీపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. కాపు సీనియర్ నేతలు హరిరామజోగయ్య, ముద్రగడ పద్మనాభంపై దృష్టి పెట్టిన వైసీపీ.. వారిని పార్టీలోకి చేర్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికే హరిరామజోగయ్య కుమారుడు సూర్యప్రకాశ్ ను పార్టీలో చేర్చుకుంది వైసీపీ. ముద్రగడతో కూడా సంప్రదింపులు జరిపింది. త్వరలోనే ఆయన వైసీపీలో చేరబోతున్నట్లుగా తెలుస్తోంది. ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఆయనను బరిలోకి దింపాలని వైసీపీ భావిస్తోంది. మరోవైపు వంగవీటి రాధాను పార్టీలోకి తెచ్చేందుకు వైసీపీ



మిగతా 2లో...

## కానిస్టేబుల్ ఉద్యోగుల నకిలీ సర్టిఫికెట్లు

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తెలంగాణలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 21న శిక్షణ ప్రారంభమైన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 13,444 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీఎస్ఎస్‌పీకి చెందిన 5,010 మందికి మినహా సివిల్, ఏఆర్ తదితర విభాగాల వారికి ఫిబ్రవరి 21 నుంచి 9 నెలల శిక్షణ మొదలైంది. అయితే కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల్లో కొందరు స్థానికత కోసం నకిలీ బోనఫైడ్ పత్రాలు సమర్పించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదట సుమారు 350 మంది పత్రాలు నకిలీవిగా అనుమానించి పక్కనపెట్టారు. అనంతరం ప్రాథమిక



మిగతా 3లో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ప్రైవేటు బస్సు బోల్తా..



### ప్రయాణికులకు గాయాలు

ఖమ్మం - ప్రభాతసూర్యుడు : జాతీయ రహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పల్టీకొట్టిన ఘటనలో పదిహేను మందికి గాయాలు అయ్యాయి. ఖమ్మం జిల్లా కూస-ుమంచి మండలం లోక్యతండ సమీపంలోని హైవేలో ప్రమాదం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న 31 మంది ప్రయాణికులు. 15 మందికి గాయాలు అయ్యాయి. హైదరాబాద్ నుండి రాజమండ్రి వెళ్తుండగా ఘటన జరిగింది.

# పటాన్ చెరువులో వ్యర్థాల ప్రాజెక్ట్

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం లోని పాశమైలారం పారిశ్రామికవాడ లో వ్యర్థ జలాల శుద్ధి కర్మాగారాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ బాబు, కొండా సురేఖ ప్రారంభించారు. పటాన్ చెరు మండలంలోని పాశ-మైలారం పారిశ్రామికవాడలో 104.24 కోట్ల రూపాయలతో వ్యర్థ జలాల శుద్ధి కర్మాగారాన్ని నిర్మించారు. స్పీకర్ తో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ కలిసి ఈ శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాశ మైలారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మరియు వివిధ పరిశ్రమల సహకారంతోభాగస్వామ్యంతో నిర్మించారు. రాంకీ ప్రైవేట్ సంస్థ కాలుష్య నియంత్రణ మండలితో ఒప్పందం కుదు-ర్చుకుంది. ఫార్మా, కెమికల్ రసాయనాలు



తయారు చేసే సుమారు 60 రసాయన పరిశ్రమలకు రక్షణగా ఉంటుందన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. పాశ మైలారం పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన 3 ఫైర్ స్టేషన్ లను ప్రభుత్వ ఆధీనంలో చేసుకొని అదనపు స్టాఫ్ ను నియమించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పారిశ్రామికవేత్తలు చేసిన సూచనల మేరకు ప్రతినెల రాష్ట్ర మంత్రి దామోదర్ రాజ నర్సిం హ సానుకూలంగా స్పందించారు. పరిశ్రమల్లో కార్మికులను కాపాడాల్సిన అవసరం యాజమాన్యంపై ఉందని కొండా సురేఖ అన్నారు.

పర్యావరణ శాఖ మంత్రిగా మొదటిసారిగా ఇంత పెద్ద సీఈటీపీ ప్లాంట్ ప్రారంభించినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ ప్లాంటుకు మొత్తం రూ.104 కోట్లు ఖర్చు కాగా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రూ.25 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో ప్రస్తుతానికి సగం నిధులు రూ.12.5 కోట్లు విడుదల అయ్యాయని, త్వరలోనే మిగతా నిధులను విడుదల చేస్తామన్నారు. పరిశ్రమల్లో కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం అధునాతన టెక్నాలజీ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపిందన్నారు.

ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమ-యంలో పాశమైలారంలో పరిశ్రమల స్థాపన మొదలైందని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. కానీ మైనింగ్, పారిశ్రామిక రంగం వల్ల కాలుష్యం రోజు-రోజుకూ పెరుగుతుందని చెప్పారు. అయితే పరిశ్రమల కోసం ప్రభుత్వాలు ఇచ్చిన స్థలాల్లో కమర్షియల్ బిల్డింగులు కట్టకూడదని సూచించారు. నెంబర్ వన్ శుద్ధి ప్లాంట్ పాశమైలారంలో ఏర్పాటు చేసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు స్పీకర్ గడ్డం ప్రసాద్. గత ప్రభుత్వానికి భిన్నంగా తాము కార్మికులతో ఇంటరాక్ట్ అయ్యే కార్యక్రమాలు చేపడతామని చెప్పా-రు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు.

# మూడు నెలల్లో 25 కోట్ల మహిళల ఉచిత ప్రయాణం

### మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు మహాలక్ష్మి పథకం అమలుకు సిద్ధమయ్యారు. విజయవంతం చేసారని రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మూడు నెలల్లో 25కోట్ల మహిళలు ఇప్పటివరకు ప్రయాణం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు కృతజ్ఞతలు. ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. ప్రావిడెంట్ ఫండ్ ని వాడుకున్నారు గతంలో... బాండ్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఇప్పుడు 2017 పిఆర్సీ పూర్తి స్థాయిలో ఇవ్వాలని అనుకుంటున్నాము. ఆర్టీసీ నష్టాల నుంచి ప్రాఫిట్ ఒరిఎంటేషన్ వైపు గా వెళ్తున్నాం. ఫైట్మెంట్ 21శాతం ఇవ్వాలని నిర్ణయించాము... దీనివల్ల ఏడాదికి భారం పడుతుంది.. అయినా కూడా ఇవ్వాలని ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులకు సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

# గురు లేదా శుక్రవారం

మొదటిపేజీ తరువాయి..



సుప్రీంకోర్టు సూచించింది. దాంతో జమ్ముకశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికలతో-పాటే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కూడా సాధ్యమో కాదో పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు కేంద్ర ఎన్నికల సంఘం జమ్ముకశ్మీర్‌లో ర్యటించనుంది.ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతోనే దేశవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లోకి రానుంది. కాబట్టి పార్టీలు, ప్రభుత్వాలు హామీలు ఇవ్వడంగానీ, ప్రాజెక్టులు ప్రారంభించడంగానీ ఈలోపే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాగా జమ్ముకశ్మీర్లో చివరగా 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత కేంద్రం జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దుచేసింది. రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లధఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది.అయితే, ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ కుప్పలుతెప్పలుగా దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు గత ఏడాది డిసెంబర్ విచారణ జరిపింది. జమ్ముకశ్మీర్‌లో 2024 సెప్టెంబర్‌లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. అదేవిధంగా సాధ్యమైనంత త్వరగా జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించాలని కేంద్రానికి సూచించింది.

## సింగిల్‌గానే పోటీ!

మొదటిపేజీ తరువాయి..

పూర్తి సన్నద్ధతతో, బలంతో ఎన్నికల్లో పోరాడుతోందని మాయావతి స్పష్టం చేశారు.ఎన్నికల్లో కూటమి, థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు పుకార్లపై తప్పుడు వార్తలు ప్రసారం చేస్తూ మీడియా తన విశ్వసనీయతను కోల్పోకూడదని.. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. అయితే రకరకాల పుకార్లు పుట్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. బహుజనుల ప్రయోజనాల దృష్ట్యా ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని బీఎస్పీ దృఢ నిర్ణయం తీసుకుందన్నారు. ఇదిలా ఉండగా.. ఇంతకు ముందు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు మాయావతి ప్రకటించారు. కూటముల్లో చేరేందుకు నిరాకరించారు. ఎన్నికల కోసం ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించలేదు. అయితే, ఆమె ఇండియా కూటమిలో చేరనున్నారనే ఊహాగానాలున్నాయి.



## ఆర్టీసీకి పీఆర్సీ



మొదటిపేజీ తరువాయి..

కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గతంలో ప్రావిడెంట్ ఫండ్‌ను వాడుకున్నారని.. బాండ్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. ఇప్పుడు 2017 పీఆర్సీని పూర్తి స్థాయిలో ఇవ్వాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఆర్టీసీ నష్టాల నుంచి ప్రాఫిట్ ఒరిఎంటేషన్ వైపుగా వెళ్తున్నామన్నారు. ఫైట్మెంట్ 21శాతం ఇవ్వాలని నిర్ణయించామని... దీనివల్ల ఏడాదికి భారం పడుతుంది.. అయినా కూడా ఇవ్వాలని ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులకు సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. పేద ప్రజలకు ప్రయాణం సాధనం ఆర్టీసీ అన్నారు. ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బస్సుల కలర్స్ వేసి నడపుతున్నాం అనటం వాస్తవం కాదన్నారు. ఆటో కార్మికులకు కొంత అన్యాయం జరిగిందని.. వారిని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. శవాల మీద పేలాలు ఏరుకునే విధంగా మాజీ మంత్రులు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. "గతంలో ఉన్న మాజీ మంత్రులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.. కానీ మమ్మల్ని ఆటో కార్మికులకు 15000 ఇవ్వాలని కోరుతున్నారు" అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చేశారు.

## కాపుల కోసం జగన్ మాస్టర్ ప్లాన్

మొదటిపేజీ తరువాయి..

ప్రయత్నిస్తోంది. వంగవీటి రాధాను బందర్ ఎంపీగా పోటీ చేయించాలని వైసీపీ ప్లాన్ చేస్తోంది. ప్రధానంగా కాపులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలోని ముఖ్య నేతలకు వల వేసే పనిలో వైసీపీ ఉంది. ఇప్పటికే కాపు సీనియర్ నేతలు, కాపు పెద్దలుగా ఉన్న హరిరామజోగయ్య, ముద్రగడ పద్మనాభం.. ఇద్దరినీ తమవైపు తీసుకునే ప్రయత్నాల్లో వైఎస్ఆర్ సీపీ ఉంది. గతంలోనూ వైసీపీలో చేరేందుకు ముద్రగడ అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ, చివరి నిమిషంలో ఆగిపోయింది. రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో ముద్రగడ చేరిక పెండింగ్ లో పడింది.ఆ తర్వాత ముద్రగడ జనసేన వైపు చూశారు. జనసేనలో చేరికకు సంబంధించి సంప్రదింపులు కూడా జరిగాయి. అయితే, ఆ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా ఆయన వైసీపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఇప్పటికే వైసీపీ కీలక నేత, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డి ఇప్పటికే ముద్రగడతో మాట్లాడారు. ఈ నెల 12న ముద్రగడ సీఎం జగన్ ను కలవబోతున్నారని సమాచారం. ముద్రగడ వైసీపీలో చేరతారా? లేక మద్దతు మాత్రమే ప్రకటిస్తారా? లేదంటే తన కుమారుడిని వైసీపీలో చేరు-స్తారా? అన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది.జనసేన, పవన్



కల్యాణ్ కు మద్దతుగా ఉంటూ వచ్చిన మరో కాపు సామాజికవర్గం కీలక నేత హరిరామజోగయ్యపైనా వైసీపీ ఫోకస్ పెట్టింది. టీడీపీతో పొత-్తులో భాగంగా పవన్ కల్యాణ్ 24 సీట్లకే పరిమితం కావడం పట్ల హరిరామజోగయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. జనసేనకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయనపైనా వైసీపీ ఫోకస్ పెట్టింది.

## ఐటీఐల్లో టాటా స్కిల్స్!

మొదటిపేజీ తరువాయి..



ప్రభుత్వం .మార్చి 11న తెలంగాణ కేబినెట్ సమావేశం కా నుంది. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కేబినెట్ భేటీకి మంత్రులు, ఉన్నాతాధికారులు హాజరు కానున్నారు. ఈ భేటీలో పలు కీలకమైన అంశాలపై చర్చించనున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మార్చి 11నే సీఎం రేవంత్ శ్రీకారం చుట్టనున్నారు. తొలుత ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ వర్తింపజేసేలా విధివిధా నాలను ఖరారు చేయాలని అధికారులను సీఎం ఇప్పటికే ఆదేశించారు. సొంత జాగా ఉన్నవారికి అదే స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేస్తామని ఎన్నికల టైమ్ లోనే కాంగ్రెస్ హామీ ఇచ్చింది. జంట నగరాలతో పాటు నార్త్ తెలంగాణలోని 5 జిల్లాల్లోని ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ క్రమంలోనే నేషనల్ హైవే 44పై రూ.1580 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 5320 కిలో మీటర్ల కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయను న్నారు. దీనిపై మెట్రో మార్గాన్ని కూడా నిర్మించనున్నారు. ఇది హైదరాబాద్ కు తొలి డబుల్ డెక్కర్ కారిడార్ కానుంది. కండ్లకోయ జంక్షన్ నుంచి ప్రారంభ మవుతుంది. సికింద్రాబాద్ లోని ప్యారడైజ్ నుంచి మొదలయ్యే కారిడార్.. తాడ్‌బండ్ జంక్షన్, బెయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫామ్ వద్ద ముగు స్తుంది. కారిడార్ మొత్తం పొడవు 5320 కిలోమీటర్లు. ఎలివేటెడ్ కారిడార్ పొడవు 4650 కిలోమీటర్లు.ఇందులో 0.600 కిలోమీటర్లు అండర్ గ్రౌండ్ టన్నెల్ ఉంటుంది. మొత్తం 131పిల్లర్లతో 6 వరుసలతో కారిడార్‌నిర్మించనున్నారు.

## ఏనుగు దంతాలు రూ.8 కోట్లు

మొదటిపేజీ తరువాయి..



దాచిపెట్టారు. వీటిని అక్రమ రవాణా చేస్తోన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సిండికేట్‌తో సంబంధం ఉన్న నలుగురు అదనపు అనుచరులను అధికారులు గుర్తించి పట్టుకున్నారు. వైల్డ్‌లైఫ్ ప్రొటక్షన్ యాక్ట్ 1972 సెక్షన్ 50 ప్రకారం ఏనుగు దంతాలను అక్రమంగా తరలించడం నిషేధం. ఈ క్రమంలో ఏనుగు దంతాలను తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి రెండు ఏనుగు దంతాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఏనుగు దంతాలు 6.8 కిలోలు ఉన్నాయి. వీటి విలువ బహిరంగ మార్కెట్లో 8 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.వన్యప్రాణుల సంరక్షణ యాక్ట్ లో కొన్ని సంస్కరణలు తీసుకొచ్చి 2023లో కొత్త అమెండ్మెంట్ ని తీసుకొచ్చారు. వీటి ద్వారా అక్రమంగా వన్య ప్రాణులను తరలిస్తున్న వారిపై చర్యల కోసం డిఆర్ఐ అధికారులకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. దీంతో గత ఏడాది భారీగా ఏనుగు దంతాలను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు డిఆర్ఐ అధికారులు. గత ఏడాది ఏనుగు దంతాలు తరలిస్తున్న ఆరు వాహనాలను అధికారులు గుర్తించి తనిఖీ చేశారు. మొత్తం 57.5 కేజీల ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, చెన్నై, కలకత్తా, బెంగళూరు ప్రాంతాల్లో ఈ ఏనుగు దంతాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## దారుణ మోసం!

మొదటిపేజీ తరువాయి..

అసల బాగోతం వెలుగులోకి వచ్చింది.వీటిలో ప్రధానంగా ఫారం 16 ఫోర్జరీ చేసి తప్పుడు అకౌంట్ స్టేట్మెంట్లను సృష్టించి దందా చేసినట్లు విచారణలో వెల్లడైంది. వారు ఇలా వినియోగదారులు పేరా మంచూరైన రుణం డబ్బులను మేనేజర్ గా ఉన్న సైదులు అతడు భార్య షేక్ సుష్మ కుమారుడు వీరయ్యలకు సంబంధించిన అకౌంట్లకు బదిలీ చేసేవాడు. ఈ విధంగా 19 మంది వినియోగదారుల రుణాలకు సంబంధించిన డబ్బులను అంటే సుమారుగా రెండు కోట్ల 84 లక్షల రూపాయలను వారి కుటుంబ సభ్యుల ఎకౌంట్లకు మళ్ళించాడు. ఇదంతా గంగ మల్లయ్య సహకారంతో షేక్ సైదులు చేసినట్లు ఉన్నతాధికారులు విచారణలో వెల్లడైంది.గంగ మల్లయ్య బదిలీ అనంతరం మరొక మేనేజర్ వీర వసంతరాయుడు వచ్చారు. గతంలో రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారు బ్రాంచికు వచ్చి మేనేజ-ర్‌ను కలిసి లోన్ గురించి ఆరా తీసేవారు. ఆ డాక్యుమెంట్లను పరిశీలించి చూస్తే అప్పటికే రుణం తీసుకుని తిరిగి చెల్లించని స్థితిలో బ్యాంకు జాబితాలో కనిపించింది. దీంతో వినియోగదారులు షాక్ గురయ్యారు. దీనిపై ముందుగా బ్యాంకు మే-నేజర్ వసంతరాయుడు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణలో రెండు కోట్లకు పైగా నగదు దారిమళ్ళిన విషయాన్ని గుర్తించారు. దీంతో నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ కేసులో ఉన్న మేనేజర్లు గంగ మల్లయ్య షేక్ సైదులు అతని భార్య సుష్మ కొడుకు వీరయ్యలు పరారీలో ఉన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి

మేడ్చల్ - ప్రభాతసూర్యుడు : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో 13 యేండ్ల మైనర్ బాలిక పై పలుమార్లు అత్యాచారానికి సిద్దు అనే వ్యక్తి పాల్పడ్డాడు. బాలిక తల్లి భర్త నుంచి వేరుగా ఉంటోంది. ఆమెకు ఉన్న ఆర్థిక ఇబ్బందులు ఆసరాగా చేసుకుని ఆమెను వ్యభిచార వృత్తి పై సిద్దు మళ్ళించాడు. దసరా పండుగ రోజు తల్లి దగ్గరికి వచ్చిన బాధితురాలు (13) ఇంటిలో ఒంటరిగా ఉండగా ఆమెపై సిద్దు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తా అని బెదిరించి అప్పటినుంచి పలుమార్లు బాలికపై అఘాయిత్యం కొనసాగించాడు. సిద్దు వేదింపులు తాళలేక బాలి తల్లికి చెప్పింది. పోలీసులు బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మోదీ.. గజవాహన సేవ!



**డిస్‌పూర్ - ప్రభాతసూర్యుడు :**
ప్రధాని నరేంద్ర మోదీ అసోం పర్యటనలో భాగంగా కజిరంగ నేషనల్ పార్క్‌ని సందర్శించారు. అక్కడ జీప్ సఫారీతో పాటు ఏనుగంబారిపై ఊరేగారు. 1957 తరవాత ఈ నేషనల్ పార్క్‌ని సందర్శించిన తొలి ప్రధాని మోదీయే. ముందు ఏనుగుపైకి ఎక్కి సవారీ చేసిన ప్రధాని నరేంద్ర మోదీ..ఆ తరవాత జీప్ సఫారీ కూడా చేశారు. ఆయనతో పాటు పార్క్ డైరెక్టర్ సోనాలీ ఘోష్, పలువురు అటవీ అధికారులున్నారు. ప్రస్తుతం ఈ సఫారీ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.రెండు రోజుల పాటు అసోంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే రూ.18 వేల కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేశారు. అసోం ప్రభుత్వంతో పాటు కేంద్రం సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌లని నిర్మిస్తోంది.

# కరీంనగర్‌లో బిగ్ ఫైట్..



**కరీంనగర్ - ప్రభాతసూర్యుడు :**
పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ స్థానంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. ఇటీవల బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో కరీంనగర్ నుంచి బండికి బీజేపీ టికెట్ ఫిక్స్ చేసింది. ఇక బీఆర్ఎస్ బోయినపల్లి వినోద్ కుమార్‌కు టికెట్ ఖరారు చేసింది. దీంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇరువురు మధ్య పోటీ జరగనుంది. ఇక కరీంనగర్ కాంగ్రెస్ టికెట్ రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. రుద్ర సంతోష్, ప్రవీణ్ రెడ్డి, రాజేంద్రరావు పేర్లను కాంగ్రెస్ పరిశీలిస్తోంది. కరీంనగర్ పరిధిలో బీజేపీ, బీఆర్ఎస్ బలంగా ఉంది. దీంతో ఆర్థికంగా బలంగా ఉన్న రాజేంద్రరావును బరిలోకి దింపాలని కాంగ్రెస్ చూస్తోంది. గత ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్ పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి రేవంత్ కేబినెట్‌లో మంత్రిగా అవకాశం దక్కించుకున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్ బలంగా ఉన్న సీట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో కరీంనగర్ సీటు కూడా ఒకటి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన పొన్నం ప్రభాకర్‌కు త్రిముఖ పోరుతో లక్షా 79 వేల ఓట్లు వచ్చాయి. ఈ సారి గట్టి అభ్యర్థిని పోటీలోకి దింపితే కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్య పోటీ ఉండే అవకాశముంటుంది. అయితే ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే కరీంనగర్‌లో నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. చివరికి రాజకీయ సన్యాసం తీసుకుంటా అనేంత వరకు మాటలు వెళ్లాయి.కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ చేశారు. గురువారం కరీంనగర్‌లో ఓ సమావేశంలో బండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బండి స్పందించారు. తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, తాను గెలిస్తే బీఆర్ఎస్ పార్టీని మూసేస్తారా? అంటూ కేటీఆర్‌క ఛాలెంజ్ చేశారు. కరీంనగర్‌లో ఎవరేం చేశారనే దానిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నట్లు బండి ప్రకటించారు. అభివృద్ధి, రామమందిర నిర్మాణంకు సంబంధించి ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమని అన్నారుకేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే కరీంనగర్‌లో అడుగు పెట్టలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఇటీవల హుస్నాబాద్‌లో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బండి సంజయ్‌పై కేటీఆర్ విమర్శలు కురిపించారు. బండి సంజయ్ ఎంపీగా ఐదేళ్లల్లో ఏం చేశారని ప్రశ్నించారు. అభివృద్ధి ఏం చేశారనేది చెప్పే దమ్ము ఆయనకు ఉందా? అని అన్నారు. కరీంనగర్ ఎంపీ అని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉందని, కేవలం మతాల పేరుతో రెచ్చగొట్టడం తప్ప బండి సంజయ్ చేసిందేమి లేదని ఆరోపించారు. కరీంనగర్ ఎంపీగా గత ఎన్నికల్లో వినోద్ కుమార్‌ను గెలిపించి ఉంటే నియోజకవర్గానికి ట్రిపుల్ ఐటీ వచ్చేదని, బండి సంజయ్ ఓ గుడి, బడి, యూనివర్సిటీ కూడా కట్టలేదని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో వినోద్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. దీంతో కేటీఆర్ తనపై చేసిన విమర్శలకు గురువారం బండి కౌంటర్ ఇచ్చారు.

## అటు కాంగ్రెస్.. ఇటు బీజేపీ..

# గులాబీతోట లూటీ!

- రోజురోజుకు డీలాపడుతున్న బీఆర్ఎస్
- జంప్ జిలానీలను అడ్డుకోలేకపోతున్న అధిష్టానం
- కాంగ్రెస్, బీజేపీ వైపు గులాబీ శ్రేణులు పలాయనం


**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ అగ్ని పరీక్ష ఎదుర్కొంటోంది. 17 నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు కరువయ్యారు. మొన్నటి వరకు పోటీకి రెడీ అన్న నేతలు.. ఇప్పుడు ఒక్కొక్కరుగా.. పోటీకి ససేమిరా అంటున్నారు. నల్గొండ నుంచి బరిలోకి దిగుతానన్న శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు అమిత్ పోటీకి నుంచి తప్పుకుంటున్నానని ఇప్పటికే పార్టీకి సంకేతాలు ఇచ్చాడు. గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయి కూడా పోటీకి వెనుకడుగు వేస్తున్నారట. మల్కాజిగిరిలో తన కొడుకు భద్రారెడ్డిని బరిలోకి దించుతానని.. నిన్న మొన్నటి వరకు చెప్పిన మాజీ మంత్రి మల్లారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును కలిసి.. తమ ఫ్యామిలీ నుంచి పోటీ చేయబోమని తేల్చి చెప్పేశారట. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి తాను పోటీకి సిద్ధంగా లేనని పార్టీకి ఇప్పటికే సంకేతాలు ఇచ్చారట.ఇక వరంగల్, మహబూబాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, భువనగిరి లాంటి నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం, కానీ పార్టీయే ఖర్చులు భరించాలంటున్నారు నేతలు. ఇలాంటి పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ కలలో కూడా ఊహించి ఉండదు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు తొలిసారి ఇలాంటి గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది గులాబీ పార్టీ. దీనికితోడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొరొక్కరు రేవంత్ ఇంటికి క్యూ కడుతున్నారు. పార్టీలో ఉంటూనే మీకు తోడుగా ఉంటామని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్‌ను కలిసి వస్తున్నారు.మాజీ సీఎం కేసీఆర్ సొంత జిల్లా అయిన మెదక్ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి కలిసొచ్చారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరకపోయినా.. ఆయన భార్య జెడ్పీ ఛైర్మన్ సునీతా రెడ్డి, తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు జెడ్పీ ఛైర్మన్ అనితారెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, భద్రచాలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇటీవలె రేవంత్‌తో భేటీ అయ్యారు.హైదరాబాద్ మాజీ మేయర్, డిప్యూటీ మే-



> పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు తొలిసారి ఇలాంటి గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది గులాబీ పార్టీ. దీనికితోడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొరొక్కరు రేవంత్ ఇంటికి క్యూ కడుతున్నారు. పార్టీలో ఉంటూనే మీకు తోడుగా ఉంటామని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్‌ను కలిసి వస్తున్నారు.

యర్‌లు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి రేవంత్‌ను కలిశారు. రామగుండం, వరంగల్ మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కాంగ్రెస్ బాట పట్టారు. తెలంగాణ వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో మెంబర్స్ అంతా జంప్ అవుతున్నారుకాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. ప్రజలకు కొద్దిరోజుల్లోనే బీఆర్ఎస్ యాదికొస్తుందని పార్టీ శ్రేణులకు.. కేసీఆర్, కేటీఆర్ భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయినా, కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు తమ రాజకీయ భవిష్యత్తును చూసుకుంటూ కొంతమంది కాంగ్రెస్ బాట పడితే మరికొందరు బీజేపీ బాట పట్టారు. జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బిబి పాటిల్, నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎంపీ రాములు ఆయన కొడుకు భరత్ కూడా కాషాయ కండువ కప్పుకోగా.. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరారు. దీంతో సిట్టింగ్ స్థానాల్లో బీఆర్ఎస్ కొత్త అభ్యర్థులను వెతుక్కోవాల్సి వస్తోంది. అసలే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ దెబ్బపడగా.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు గులాబీ పార్టీకి ఊపిరిసలపనివ్వట్లేదు..!రెండు జాతీయ పార్టీల మధ్య బీఆర్ఎస్ నలిగిపోతోంది. జాతీయ పార్టీ అని టీఆర్ఎస్‌ను తీసేసి బీఆర్ఎస్ అని పెట్టుకుని అటు జాతీయ పార్టీకి ఇటు ప్రాంతీయ పార్టీకి కాకుండా పోయింది బీఆర్ఎస్. రెండు జాతీయ పార్టీల వ్యూహాలు ప్రతివ్యూహాల మధ్య ఇరుక్కుని విలవిలాడిపోతోంది.

# బీఆర్ఎస్‌కు మరో షాక్



బీజేపీలో చేరనున్న సీతారాంనాయక్

**వరంగల్ - ప్రభాతసూర్యుడు :**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగులుతుందా అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. బీఆర్ఎస్ మహబూబాబాద్ మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ పార్టీకి గుడ్ బాయ్ చెప్పడానికి సిద్ధమవుతున్నారు. రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి హనుమకొండలోని ప్రొఫెసర్ సీతారాం నాయక్ ఇంటికి వెళ్లడం రాజకీయ చర్చకు దారితీస్తుంది. సీతారాం నాయక్ పార్టీ మారడానికి సిద్ధం కావడంతో బిజెపిలోకి ఆహ్వానించడానికి కిషన్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లినట్టు తెలుస్తుంది. కొద్దిసేపు సీతారాం నాయక్ తో కిషన్ రెడ్డి భేటీ అయి.. అనంతరం ఇద్దరు కలిసి మీడియా ముందుకు వచ్చారు. ములుగు జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ తాత్కాలిక భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందని కిషన్ రెడ్డి అన్నారు. 2024- 25 అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు ప్రొఫెసర్ సీతారాం నాయక్. బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ గిరిజన రిజర్వేషన్ల కోసం పోరాటం చేశారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. స్థానిక ఎంపీగా ఉన్నప్పుడు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. గిరిజనుల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ రావాల్సి ఉంది కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ చేయకుండా గిరిజనులకు అన్యాయం చేసిందని కిషన్ రెడ్డి అన్నారు.2014 నుండి గిరిజనుల రిజర్వేషన్లు పట్టించుకోకుండా మొన్నటి ఎన్నికల ముందు రిజర్వేషన్ జీవోను బీఆర్ఎస్ తీసుకొచ్చిందని కిషన్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన విశ్వవిద్యాలయానికి భూమి ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై ఆలస్యం చేస్తుందని అన్నారు.

# కానిస్టేబుల్ ఉద్యోగుల నకిలీ సర్టిఫికెట్లు

మొదటిపేజీ తరువాయి..
విచారణలో 250 నిజమేనని తేలింది. దీంతో మిగతా 100 మందికి శిక్షణను తాత్కాలికంగా నిలిపివేసి, క్షేత్రస్థాయిలో స్పెషల్ బ్రాంచ్ అధికారులతో లోతుగా విచారణ చేయిస్తున్నారు. వారు చదివిన పాఠశాలల రిజిస్టర్లతో సహా తనిఖీ చేయనున్నారు.సాధారణంగా హైదరాబాద్ పరిధిలో ఎక్కువ పోస్టులుంటాయి. దీంతో ఇక్కడి పాఠశాలల నుంచి నకిలీ బోనఫైడ్ తీసుకున్నట్లు స్పెషల్ బ్రాంచి అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉండే ఒక పాఠశాల పదుల సంఖ్యలో అభ్యర్థులకు బోనఫైడ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పలు పాఠశాలలపైనా ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి 7 వరకు నాలుగు తరగతులు ఎక్కడ చదివి ఉంటే అక్కడి స్థానికుడిగా పరిగణిస్తారు. ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థుల స్థానికతకు పాఠశాలలు ఇచ్చే బోనఫైడ్‌లనే ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు అభ్యర్థులు ప్రాథమిక విద్య రెండు జిల్లాల్లో చదివినట్లు.. అందులో ఒకటి హైదరాబాద్ జిల్లా ఉన్నట్లు పరిశీలనలో వెలుగుచూసింది. సుదూర ప్రాంతాలకు చెందిన వారు నగరంలో చదివినట్లు చూపడం.. అవి కూడా కొన్ని తరగతులే కావడంతో అనుమానాలకు బలం చేకూర్చింది. జీవో 46 ప్రకారం జనాభా ప్రాతిపదికన పోస్టులు కేటాయించి నియామకాలు చేపడతారు. తెలంగాణలో కొత్తగా నియమితులైన పోలీస్ కానిస్టేబుళ్లకు గత నెల చివరివారంలో శిక్షణ ప్రారంభం కాగా.. ఇప్పటికీ పలువురు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. శిక్షణకు ఎంపికైన వారిలో సుమారు 10 శాతం మంది ఇంకా రిపోర్ట్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శిక్షణ కళాశాలలు, నగర శిక్షణ కేంద్రాలు, జిల్లా శిక్షణ కేంద్రాలతోపాటు టీఎస్ఎస్‌పీ బెటాలియన్లు అన్నీ కలిపి 28 కేంద్రాల్లో ఫిబ్రవరి 21 నుంచి శిక్షణ ప్రారంభమైంది. మొత్తం 13,953 మంది కానిస్టేబుళ్లకు గాను తొలిదశలో 9,333 మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించగా.. మొదటి రోజు సుమారు 6,500 మంది మాత్రమే హాజరయ్యారు. మార్చి మొదటివారం ముగిసేనాటికి ఇంకా 900 మంది వరకు శిక్షణకు హాజరుకాలేకపోయినట్లు తెలుస్తోంది. కంటి పరీక్షల్లో జాప్యం వల్ల ఎక్కువమంది హాజరు కాలేకపోయినట్లు తేలింది. ఇతర పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు రావడంతో పలువురు హాజరు కాలేదని చెబుతున్నారు. పెట్టీ కేసులు, నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్లు దాఖలు చేసినట్లు స్పెషల్ బ్రాంచి విచారణలో తేలడం వంటి కారణాలతో మరికొందరు శిక్షణకు అర్హత సాధించలేకపోయినట్లు అధికారులు అంటున్నారు.



# సిరీస్ ఇండియా కైవసం




## మడత పెట్టేసిన భారత్ బౌలర్లు

**ధర్మశాల- ప్రభాతసూర్యుడు :**
ధర్మశాల వేదికగా జరిగిన ఐదో టెస్టులోనూ భారత జట్టు సత్తా చాటింది. మూడు రోజుల్లోనే ఇంగ్లండ్ ను మడతెట్టేసింది. ఏకంగా ఇన్నింగ్స్ 64 పరుగుల తేడాతో ఇంగ్లిష్ జట్టును ఓడించి 4-1 తేడాతో సిరీస్ ను కైవసం చేసుకుంది. 259 పరుగుల ఇన్నింగ్స్ లోటుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ జట్టు కేవలం 195 పరుగులకే కుప్పకూలింది. వందో టెస్టు ఆడుతున్న రవి చంద్రన్ అశ్విన్ 5 వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. ఇంగ్లండ్ జట్టులో జోరూట్ () మినహా మరెవరూ పెద్దగా పరుగులు చేయలేదు. దీంతో ధర్మశాలలోనూ ఆ జట్టుకు పరాజయం తప్పలేదు. ధర్మశాల టెస్టు మ్యాచ్ మూడు రోజుల్లో ముగియడం విశేషం. ఈ సిరీస్‌లో అంతకుముందు నాలుగు మ్యాచ్‌లు నాలుగో రోజు వరకు సాగాయి. టీమ్ ఇండియా సాధించిన ఈ విజయం చాలా చారిత్రాత్మకమైనది ఎందుకంటే టెస్ట్ క్రికెట్‌లో 112 సంవత్సరాల తర్వాత, ఒక జట్టు మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఓడి 4-1 స్కోరుతో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. అప్పుడు ఇంగ్లండ్ జట్టు భారత్‌ను కష్టాల్లో పడేస్తుందేమో అనిపించింది. రెండో మ్యాచ్‌లో కూడా అలాంటిదే జరిగింది కానీ ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. ఆ తర్వాత భారత జట్టు జోరును ఆపడం ఇంగ్లండ్ తరం కాలేదు.మూడో రోజు మ్యాచ్‌లో టీమిండియా నిన్నటి స్కోరుతో 8 వికెట్ల నష్టానికి 473 పరుగులతో ఇన్నింగ్స్ ప్రారంభించింది. భారత జట్టు ఖాతాలో కేవలం నాలుగు పరుగులు మాత్రమే చేరి ఆలౌట్ అయింది. కుల్దీప్ యాదవ్‌ను ఔట్ చేయడం ద్వారా జేమ్స్ అండర్సన్ టెస్టుల్లో 700 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. దీని తర్వాత జస్ప్రీత్ బుమ్రాను ఔట్ చేయడం ద్వారా షోయబ్ బషీర్ భారత ఇన్నింగ్స్‌ను ముగించాడు. దీంతో ఇంగ్లండ్‌పై భారత్ కు 259 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

# అంతా పద్ధతే.. మొదటినుంచి అంతే!

మొదటిపేజీ తరువాయి..
ఆమోదముద్ర వేసింది.. కానీ హైకోర్టు ఇందుకు విరుద్ధంగా తీర్పు ఇచ్చింది. భారత రాష్ట్ర సమితి గతంలో నిర్ణయించిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే ఇక్కడ వారికి దక్కే ఫాయిదా ఏదీ ఉండకపోవచ్చు. తీర్పు వెలువరించే విషయంలో హైకోర్టు కొన్ని వ్యాఖ్యలు చేసింది. "వాళ్ల అర్హతలకు సంబంధించిన వివరాలు కావాలంటే క్యాబినెట్ నుంచి తెప్పించుకుంటాం. వారి నియామకాన్ని పున: పరిశీలిస్తాం" అని వ్యాఖ్యానించింది. నిబంధన ప్రకారం అది కచ్చితంగా జరగాలి. అందువల్లే హైకోర్టు కోదండరాం, అలీ ఖాన్ నియామకానికి సంబంధించిన జీవోను కొట్టివేసింది.హైకోర్టు తీర్పు వరకే పరిమితమైంది. గవర్నర్ విచక్షణాధికార పరిధిలోకి ప్రవేశించలేదు. ఇదే ఇప్పుడు అందరి మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్న. అయితే ఇక్కడే మళ్ళీ మరొక విధానం ప్రారంభమవుతుంది. గవర్నర్ క్యాబినెట్ నుంచి వివరాలు అడుగుతుంది. గత క్యాబినెట్ ప్రస్తుతం లేదు కాబట్టి.. కోదండరాం, అలీ ఖాన్ నియామకాన్ని రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది కాబట్టి.. ప్రస్తుత క్యాబినెట్ ఆ వివరాలు గవర్నర్ కు అందిస్తుంది. (ఒకవేళ పాత క్యాబినెట్ ఉన్నప్పుడు ఈ తీర్పు కనుక వచ్చి ఉంటే కథ వేరే తీరుగా ఉండేది) ప్రస్తుతం గవర్నర్‌కు, ప్రభుత్వానికి ఎటువంటి విభేదాలు లేవు కాబట్టి కోదండరాం, అలీ ఖాన్ నియామకానికి ఆమోదముద్ర వేస్తుంది. వాస్తవానికి హైకోర్టు చెప్పినట్టు అభ్యర్థుల అర్హతల మీద ఏమైనా సందేహాలు ఉంటే క్యాబినెట్ అభిప్రాయాలు కచ్చితంగా తెప్పించుకోవాలి. సో ఇప్పుడు జరిగేది అదే కాబట్టి.. పెద్ద ఇబ్బంది లేదు. ఒకవేళ వారు గవర్నర్ కోటాలో నియమితులై ఉంటే.. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారై ఉండాలి. ఈ జాబితాలో రాజకీయ నాయకులపై నిషేధం వంటి నిబంధన లేదు. సాధారణంగా ఇలాంటి వాటిని అధికారంలో ఉన్న ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకొని, సంబంధిత దస్త్రాన్ని గవర్నర్ కు పంపిస్తుంది. గవర్నర్ కూడా దానికి ఆమోదం ముద్ర వేస్తారు. కానీ కోదండరాం, అలీ ఖాన్ విషయంలో జరిగింది వేరు.గతంలో కౌశిక్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం గవర్నర్ దృష్టికి పంపింది. గవర్నర్ తిరస్కరించడంతో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఆమెను రకరకాలుగా విమర్శించింది. సొంత పత్రికలో అవమానించింది. ఎంత గవర్నర్ అయినా ఆమె కూడా ఒక మనిషే కాబట్టి సహజంగా గత ప్రభుత్వంపై కోపం ఉంది. అందుకే తన విచక్షణాధికారాన్ని ఉపయోగించి దాసోజు శ్రవణ్, సత్యనారాయణను పక్కన పెట్టింది. వాస్తవానికి నిబంధనల ప్రకారం శ్రవణ్ అర్హుడే. కానీ గత ప్రభుత్వం తనను పెట్టిన ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని గవర్నర్ తన విచక్షణాధికారాన్ని ఉపయోగించింది. హైకోర్టు తీర్పు వెలువరించినప్పటికీ గవర్నర్ విచక్షణాధికారాల పరిధిలోకి ప్రవేశించలేదు. ఆ అధికారాలకు సంబంధించి జోక్యం చేసుకోలేదు. ఒకవేళ అది జరిగి ఉంటే గవర్నర్ తనకున్న అధికారాల మీద కోర్టును స్పష్టత అడిగేది. అప్పుడు ఆ కేసు మరింత తీవ్రమయ్యేది. ఇప్పుడిక గవర్నర్ కూడా ఆ ఇద్దరు ఎమ్మెల్సీల నియామకాన్ని ఆపలేరు. ఈ విషయాన్ని మోడీ, అమిత్ షాకు చెప్పకుండా ఉండలేరు. సో మొత్తానికి కోదండరాం, అలీ ఖాన్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు అవుతున్నారు. ఎమ్మెల్సీలయిన మరుసటి క్షణమే కోదండరాం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారట.. రేవంత్ రెడ్డి మదిలో కూడా అదే ఆలోచన ఉందట. కెసిఆర్‌కు మరొక కౌంటర్ ఇవ్వడానికి రేవంత్ రెడ్డి రెడీగా ఉన్నాడన్నమాట.. వారెవా భలేగా ఉంది పో తెలంగాణ రాజకీయం.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఆటో బోల్తా..ఒకరు మృతి

### ఐదుగురికి గాయాలు




**మేడ్చల్- ప్రభాతసూర్యుడు :** దైవ దర్శన్ కి వెళ్తుండగా ఒకే కుటుంబానికి చెందిన ఆటో బోల్తా పడి ఒక్కరు మృతి చెందగా మరో అయిదుగురికి గాయాలైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పటాన్ చెరువు లోని బండ్లగుడా కి చెందిన మల్లేష్ తన కుటుంబం తో సిద్దిపేట జిల్లా కోమరేవెల్లి దర్శనానికి వెళ్తుండగా శనివారం మేడ్చల్ చెక్ పోస్ట్ లోని కిష్టాపూర్ రోడ్ హెచ్ పీ పెట్రోల్ బంకు వద్ద పిల్లర్ ఢీకొని ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ మల్లేష్ (40) అక్కడికక్కడే మృతి చెందగా మల్లమ్మ అనే మహిళ కాలు ఫ్రాక్చర్ అయింది మిగిలిన వారి గాయాల చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రి తరలించారు పోలీసుల సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు.

## సంపాదకీయమ్..


### జమిలీ ఎన్నికలు సాధ్యమా..?

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్లల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ మార్పులకు శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో దేశవ్యాప్తంగా ఒకేసారి అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే దిశగా అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గత కొద్ది నెలలుగా జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేపడుతుండగా.. త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందచేయనుందని తెలుస్తోంది.ఎన్నికలు సాధ్యమా? కాదా? ఒకవేళ నిర్వహించాలనుకుంటే ఎలాంటి రాజ్యాంగ సవరణలు చేయాలి? అనే అంశాలను కోవింద్ కమిటీ పరిశీలించింది. వీటిపై ఒక నివేదికను తయారుచేసే పనిలో నిమగ్నమైంది. ఇందులో పలు సిఫార్సులు చేసింది. 2029 నాటికి జమిలీ ఎన్నికలు జరపాలంటే ఎలాంటి మార్పులు చేయాలి? రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం పొడిగించాలంటే ఏం చేయాలి? అనే దానిపై కేంద్రానికి పలు సూచనలు చేయనున్నారు. అలాగే లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలన్నింటికీ ఉమ్మడి ఓటు జాబితా ఉండాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేయనుందని తెలుస్తోంది. రాష్ట్రపతి పాలన విధించడానికి ఆర్టికల్ 356, అసెంబ్లీల వ్యవధికి సంబంధించి ఆర్టికల్ 172, అసెంబ్లీల రద్దుకు సంబంధించి ఆర్టికల్ 174, లోక్‌సభ రద్దుపై ఆర్టికల్ 85, పార్లమెంట్ సభల వ్యవధికి సంబంధించి ఆర్టికల్ 83తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టంలో పలు మార్పులు చేయాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.ఇప్పటికే జమిలీ ఎన్నికలపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రుతురాజ్ అవస్థీ ఆధ్వర్యంలోని న్యాయ కమిషన్ కేంద్రానికి పలు సూచనలు చేసింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యాంగంలో కొత్త చాప్టర్‌ను చేర్చాలని సిఫార్సు చేసింది. న్యాయ్ కమిషన్ నివేదికను ఇప్పటికే కేంద్రం పరిశీలించింది. మరింతగా దీనిపై అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో గత ఏడాది సెప్టెంబర్‌లో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వివిధ పార్టీలతో పాటు జడ్జీలు, మేధావులతో సమావేశమైంది. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు స్వీకరించి రిపోర్ట్‌ను రెడీ చేసింది. మరికొద్దిరోజుల్లో ఈ రిపోర్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచనుంది. ఈ నివేదిక ఆధారంగా జమిలీ ఎన్నికలపై కేంద్రం నిర్ణయం తీసుకోనుంది. 2029 మే లేదా జూన్ నెలలో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం చూస్తోంది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరపాలంటే ఎన్నికల సంఘం ముందు అనేక సవాళ్లు ఉంటాయి. ఈవీఎంలు, సిబ్బంది, భద్రత వంటివి కష్టతరంగా మారతాయి. జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంల కోసం ప్రతీ 15 ఏళ్లకు రూ.10 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఈసీ అంచనా వేసింది. అలాగే ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే పర్యవేక్షణ కూడా కష్టమవుతుంది. దీంతో వీటిపై ఈసీ కూడా పరిశీలన చేపడుతోంది. రామ్‌నాథ్ కమిటీ ఈసీకి ఎలాంటి సిఫార్సులు చేస్తుందనేది కీలకంగా మారింది.ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల కోసం దేశవ్యాప్తంగా సుమారు 11.8 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఈసీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రెండు సెట్ల ఈవీఎంలు (ఒకటి లోక్‌సభ స్థానానికి, మరొకటి అసెంబ్లీ నియోజకవర్గానికి) అవసరమవుతాయని తెలిపింది. పని చేయని ఈవీఎంల స్థానంలో నిర్దిష్ట సంఖ్యలో అదనపు ఈవీఎంలతో పాటు ఈవీఎంల సంఖ్యకు అనుగుణంగా కంట్రోల్ యూనిట్లు (సీయూలు), బ్యాలెట్ యూనిట్లు (బీయూలు), ఓటర్-వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) మెషిన్లు అవసరమని ఈసీ పేర్కొంది.మరోవైపు వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఏకకాల ఎన్నికలకు అవసరమైన కనీస ఈవీఎంలతోపాటు 46,75,100 బీయూలు, 33,63,300 సీయూలు, 36,62,600 వీవీపీఏటీలు అవసరమవుతాయని ఈసీ తెలిపింది. 2023 నాటి రేట్ల ప్రకారం బీయూ ధర రూ. 7,900, సీయూ ధర రూ. 9,800, వీవీపీఏటీ యూనిట్ రూ. 16,000 కలుపుకుని ఒక్కో ఈవీఎం యూనిట్ ధర రూ.33,700గా అంచనా వేసింది.కాగా, అదనపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, భద్రతా సిబ్బంది, ఈవీఎంల భద్రతా స్థలాలు, వాహనాలు కూడా అవసరమని ఈసీ తెలిపింది. అలాగే రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని పేర్కొంది. ఈ స్థాయిలో ఈవీఎంలు సమకూర్చుకుని ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుంటే 2029లో దేశవ్యాప్తంగా ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించవచ్చని వెల్లడించింది. ఒకే దేశం, ఒకే ఎన్నికకు సంబంధించి న్యాయ మంత్రిత్వ శాఖ అడిగిన ప్రశ్నలకు గత ఏడాది ఫిబ్రవరిలో ఈ మేరకు ఈసీ నివేదిక ఇచ్చింది.

## తలపండిన నేతలు తప్పుకోవాల్సిందేనా?

- ఏపీ టీడీపీలో సీనియర్ల పోటీపై సందేహాలు
- 40ఏళ్లుగా పార్టీని వీడని పలువురు ఉద్దండులు
- వైసీపీ పొత్తుతో కొన్ని స్థానాల్లో తప్పని చెక్
- తొలి జాబితాలో పలువురికి దక్కని ఛాన్స్
- అధినేత చంద్రబాబు నిర్ణయంపై సందిగ్ధత
- గెలుపు కోసం 'దేశం' వ్యూహాత్మక అడుగులు

**టీడీపీలో సీనియర్ లీడర్లకు పరా భవం తప్పదా? ఈ సారి ఎన్నికల రణరంగం నుంచి సూపర్ సీనియర్లు తప్పుకోవాల్సిందేనా? ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే? ఔనన్న సమాధానమే వినిపిస్తోంది. పరిస్థితులన్నీ సీనియర్లకు ప్రతికూలంగానే కనిపిస్తున్నాయి. ఒకరిద్దరు తప్ప? 40 ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతున్న పెద్దలకు ఈ సారి పోటీ చేసే చాన్స్ దాదాపు లేనట్లేనంటున్నారు.**



**విజయవాడ, ప్రభాతసూర్యుడు :**
టీడీపీది 40 ఇయర్స్ పొలిటికల్ స్టోరీ. ఆ పార్టీలో ఉన్న వారిలో చాలా మంది 40 ఇయర్స్ ఎక్స్‌పీరియన్స్ లీడర్లే! పార్టీ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు పార్టీనే నమ్ముకున్న లీడర్లే అంతా. అయితే 40 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఈ సూపర్ సీనియర్స్‌కు ఈ సారి చెక్ పడుతుందనే టాక్.. ఏపీ రాజకీయాల్లో దుమారం రేపుతోంది. టీడీపీలో సీనియర్ లీడర్లకు పరాభవం తప్పదా? ఈ సారి ఎన్నికల రణరంగం నుంచి సూపర్ సీనియర్లు తప్పుకోవాల్సిందేనా? ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే? ఔనన్న సమాధానమే వినిపిస్తోంది. పరిస్థితులన్నీ సీనియర్లకు ప్రతికూలంగానే కనిపిస్తున్నాయి. ఒకరిద్దరు తప్ప? 40 ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతున్న పెద్దలకు ఈ సారి పోటీ చేసే చాన్స్ దాదాపు లేనట్లేనంటున్నారు. తెలుగుదేశం పార్టీది 40 ఏళ్ల చరిత్ర. 1982లో ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పార్టీని వదిలిపెట్టకుండా ఉన్న లీడర్లు ఎందరో ఉన్నారు. కొందరు నేతలు పార్టీని వీడినా? పొరుగు పార్టీలో ఇమడలేక మళ్లీ సొంతగూటికి చేరిపోయారు. అయితే ఇలా వెళ్లినవాళ్లు.. ప్రస్తుతం పార్టీలో ఉన్నవారు అందరూ దాదాపు 70 ఏళ్ల వయసు పైబడిన వారే కావడంతో భారంగా భావిస్తోంది పార్టీ?. ఇన్నాళ్లు ఆయా లీడర్లు త్యాగాలు చేసినా వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలవాలంటే సీనియర్లను వదిలించుకుంటే కాని పనికాదన్న భావనకు వచ్చేసిందంటున్నారు. అందుకే తొలి జాబితాలో ఒకరిద్దరు తప్ప సీనియర్లుగా ఉన్న నేతలు ఎవరికీ సీట్లు దక్కలేదని అంటున్నారు. టీడీపీ సూపర్ సీనియర్లలో దాదాపు అందరూ అధినేత చంద్రబాబుతో సమానంగా రాజకీయాల్లోకి వచ్చినవారే! చంద్రబాబుతో పాటు మాజీ మంత్రులు అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడు, కిమిడి కళా వెంకటరావు, బండారు సత్యానారాయణమూర్తి, చింతకాయల అయ్యన్నపాత్రుడు, చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, హనుమంతరాయ చౌదరి, కేఈ ప్రభాకర్, లింగారెడ్డి, వరదరాజులురెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వంటివారు 80వ దశకంలోనే రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఇక జ్యోతుల నెహ్రూ, ఆలపాటి రాజా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, దేవినేని ఉమ, గంటా శ్రీనివాసరావు, కొనకళ్ల నారాయణ వంటివారు కూడా దాదాపు 30 ఏళ్లుగా టీడీపీతో కలిసి ప్రయాణం చేశారు. గంటా శ్రీనివాసరావు, కళావెంకటరావు వంటివారు మధ్యలో పీఆర్‌పీలో చేరినా? తర్వాత మళ్లీ సొంత గూటికి వచ్చారు.ఇలా టీడీపీలో కొనసాగుతున్న సీనియర్లలో ఈసారి ఒకరిద్దరికి తప్ప చాలా మందికి అవకాశం దక్కేలా కనిపించడం లేదు. యనమల రామకృష్ణుడు గత ఎన్నికల్లోనే ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకోగా, అశోక్‌గజపతిరాజు కూడా అదే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక మిగిలిన సీనియర్లలో చినరాజప్ప, అయ్యన్నపాత్రుడు, జ్యోతుల నెహ్రూకు మాత్రమే ఈసారి టికెట్లు దక్కాయి. మిగిలిన వారిలో కొందరికి జనసేన రూపంలో కత్తెర పడగా, మరికొందరిని తప్పించాలని భావిస్తోంది పార్టీ అధిష్టానం.ఈ సారి అధిష్టానం హిట్‌లిస్టులో ఉన్నవారిలో కళావెంకటరావు, బండారు సత్యానారాయణమూర్తి, దేవినేని ఉమ, లింగారెడ్డి, కొనకళ్ల నారాయణ, వరదరాజుల రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. కళా వెంకటరావు ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఎచ్చెర్ల నుంచి ఆయనను తప్పించి చీపురుపల్లిలో పోటీకి పెట్టే ప్రతిపాదన తెరపైకి తెస్తోంది టీడీపీ హైకమాండ్. ఇప్పటికే చీపురుపల్లి నుంచి గంటాకు పోటీచేయమన్న టీడీపీ అధిష్టానం? ఆయనను సముఖంగా లేకపోవడంతో కళా పేరు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.ఎచ్చెర్లలో కళాకు ప్రత్యామ్నాయం ఉండటంతో ఐతే చీపురుపల్లి లేదా విజయనగరం ఎంపీగా ఆయనను బరిలోకి దింపే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తోంది టీడీపీ? ఇక బుచ్చయ్య చౌదరి సీటుకు జనసేన అడ్డుగా మారింది. బుచ్చయ్యచౌదరి కోరుతున్న రాజమండ్రి రూరల్‌లో జనసేన నేత కందుల దుర్గేశ్ గట్టిపోటీదారుగా ఉన్నారు. దుర్గేశ్‌కు ప్రత్యామ్నాయంగా నిడదవోలు టికెట్ ఇస్తామంటున్నారు. అదే జరిగితే బుచ్చయ్య చౌదరికి లైన్‌క్లియర్ అయినట్లే? అంతవరకు బుచ్చయ్య సీటుపై సస్పెన్స్ కొనసాగే అవకాశం ఉంది.ఇక కొనకళ్ల నారాయణ, లింగారెడ్డి, వరదరాజులురెడ్డి, కేఈ ప్రభాకర్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. నారాయణను మచిలీపట్నం ఎంపీగా పోటీకి పెట్టాలని భావించినా, ఆ సీటు జనసేనకు కేటాయించే అవకాశాలే ఎక్కువగా ఉండటంతో నారాయణ రాజకీయ భవిష్యత్‌కు ఫుల్‌స్టాప్ పడినట్లేనని అంటున్నారు. ఇక లింగారెడ్డి, వరదరాజులురెడ్డికి రాజకీయంగా రెస్ట్ ఇచ్చే పరిస్థితే కనిపిస్తోంది. గంటా శ్రీనివాసరావు, యరపతినేని శ్రీనివాసరావు, దేవినేని ఉమా పోటీ ఎక్కడ అనే ఉత్కంఠే కొనసాగుతోంది. గంటా కోరుకుంటున్న భీమిలి సీటు ఇస్తారా? లేక? చీపురుపల్లి వెళ్లమంటారా? అన్నది క్లారిటీ రావడం లేదు.ఇక యరపతినేని శ్రీనివాసరావుకు గురజాల టికెట్ చివరి నిమిషంలో పెండింగ్‌లో పడిందంటున్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరడంతో యరపతినేని విషయంలో తర్జనభర్జన పడుతోంది పార్టీ అగ్రనాయకత్వం. ఇక దేవినేని ఉమ? పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందంటున్నారు. గత ఎన్నికల్లో మైలవరంలో ఓడిపోయిన ఉమా సీటును.. సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తన్నుకుపోయారంటున్నారు. వసంత రాకతో ఉమా సీటు గల్లంతు అవ్వడం కృష్ణా జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.ఇలా టీడీపీలో సీనియర్ నేతలుగా చెప్పుకున్న లీడర్లలో దాదాపు 90 శాతం మందికి సీట్లు దక్కకపోవడం అంతర్గతంగా పెద్ద చర్చే నడుస్తోంది. ఇదే సమయంలో లోకేశ్ సూచనలతో దాదాపు 30 మంది కొత్తవారికి టికెట్లు ఇవ్వడం కూడా విస్తృత చర్చకు దారితీస్తోంది. గెలుపే టార్గెట్‌గా చంద్రబాబు? కొత్తవారికి టికెట్లు ఇచ్చి, పాతవారిని పక్కనపెట్టారంటున్నారు. ఐతే దీనిపై కొన్ని విమర్శలూ వినిపిస్తున్నాయి. చంద్రబాబు తన కుమారుడు లోకేశ్ కోసం సీనియర్లను తప్పించి జూనియర్లతో లైన్‌క్లియర్ చేస్తున్నారనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇందులో నిజముందో లేదో కాని సీనియర్లకు హ్యాండ్ ఇచ్చే వాతావరణం మాత్రం టీడీపీని కుదిపేస్తోంది

## 'ఇందిరమ్మ' ఇంటికి కట్టుబాట్లు!

### మార్గదర్శకాలు సిద్ధం చేసిన సర్కారు

**ఖమ్మం - ప్రభాతసూర్యుడు :**
కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీల అమల్లో భాగంగా పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ వ్యయాన్ని 4 దశల్లో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణ దశల ఆధారంగా అధికారుల పరిశీలన అనంత రం ఆధార్ నెంబర్ మేరకు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమ చేయనుంది. స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వనుంది. దీన్ని రాయితీ రూపంలో లబ్ధిదారునికి అందించనుంది. స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అంతే మొత్తాన్ని కేటాయించనుంది. తొలి దశలో సొంత స్థలం ఉన్న లబ్ధిదారులతో ఈ పథకాన్ని ఈ నెల 11న భద్రాచలం లో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సైతం అధికారులు సిద్ధం చేశారు. త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.



#### నాలుగు దశల్లో ఆర్థిక సాయం

లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం 4 దశల్లో ఆర్థిక సాయం అందిస్తారు.

- బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష
- రూఫ్ (పైకప్పు) స్థాయిలో రూ.లక్ష
- పైకప్పు నిర్మాణం తర్వాత 2 లక్షలు
- ఇంటి నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష అందించనున్నారు. ప్రతి దశలోనూ అధికారులు పరిశీలన అనంతరం డబ్బు మంజూరు చేస్తారు.

#### వీరే అర్హులు

- దారిద్ర్యరేఖకు (బీపీఎల్) దిగువన ఉన్న వారు, ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది.
- లబ్ధిదారునికి సొంత స్థలం ఉండాలి. లేదా ప్రభుత్వ స్థలం ఇచ్చి ఉండాలి.
- గ్రామం లేదా పురపాలిక పరిధి వారై ఉండాలి.
- గుడిసె ఉన్నా, గడ్డితో పైకప్పును నిర్మించిన ఇల్లు, మట్టి గోడలతో నిర్మించిన తాత్కాలిక ఇల్లున్నా అర్హులు.
- అద్దె ఇంట్లో ఉంటున్నా, వివాహమైనా, ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నా లబ్ధిదారుడిగా ఎంపిక కావొచ్చు
- ఒంటరి, వితంతు (విడోవర్) మహిళలూ అర్హులే.

#### ఇళ్ల మంజూరు ఇలా

- ఇందిరమ్మ ఇంటిని మహిళ పేరు మీదే మంజూరు చేస్తారు. ఇంట్లో వితంతు మహిళలు ఉంటే ఆమె పేరు మీదే ఇస్తారు.
- గ్రామ, వార్డు సభల్లో ఆమోదం పొందిన తర్వాతే లబ్ధిదారులను కలెక్టర్ ఎంపిక చేస్తారు.
- ఆ జిల్లా ఇంఛార్జీ మంత్రిని సంప్రదించి కలెక్టర్ ఇంటిని మంజూరు చేస్తారు.
- లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రదర్శించాకే ఖరారు చేస్తారు.
- జిల్లాల్లో కలెక్టర్, జీహెచ్ఎంసీలో కమిషనర్ ఎంపిక చేసిన బృందాలు లబ్ధిదారుల అర్హతలను పరిశీలిస్తారు.
- 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలి. కిచెన్, బాత్రూం సెపరేట్. ఆర్ సీసీ రూఫ్‌తో నిర్మించాలి.
- ఏటా 4.50 లక్షల ఇళ్లు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది.

## ఆస్ట్రేలియాలో బెజవాడ యువతి మృతి

- ట్రెక్కింగ్‌కు వెళ్లి లోయలో పడిన వేమూరు ఉజ్వల
- ఆస్ట్రేలియాలో వైద్య విద్య, అక్కడే డాక్టర్‌గా ఉద్యోగం

**విజయవాడ - ప్రభాతసూర్యుడు :**
కృష్ణా జిల్లాకు చెందిన ఓ యువ వైద్యురాలు ఆస్ట్రేలియాలో ప్రమాదవశాత్తు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. ఉంగుటూరుకు చెందిన వైద్యురాలు వేమూరు ఉజ్వల (23) ఆస్ట్రేలియా గోల్డ్ కోస్ట్ లోని బాండ్ విశ్వ విద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె రాయల్ బ్రిస్బేన్ ఉమెన్స్ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఈ నెల 2న స్నేహితులతో కలిసి సరదాగా ట్రెక్కింగ్ వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని స్నేహితులు తల్లిదండ్రులకు చేరవేశారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. ఉజ్వల తనకు ఇష్టమైన విభాగంలో పీజీ చేసి ఉన్నత స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని ఇంతలోనే ఇలా మృత్యువు కబళించిందని ఆవేదన వ్యక్తం చేశారు.గన్నవరంలోని స్వగ్రామానికి వైద్యురాలు ఉజ్వల మృతదేహం శనివారం చేరుకుంది. ఈ క్రమంలో ఆమె



పార్థివ దేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు భోరున విలపించారు. ఉంగుటూరు మండలం ఎలుకపాడులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## జగద్గిరిగుట్టలో దారుణం



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
మేడ్చల్ జిల్లా జీడిమెట్ల జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. మహిళతో సహజీవనం చేస్తోన్న ఓ వ్యక్తి ఆమె కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గతంలో భర్త నుంచి విడిపోయిన బాధిత బాలిక తల్లి చంద్రశేఖర్ అలియాస్ సిద్ధుతో కలిసి సహజీవనం చేస్తోంది. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. వీరు తండ్రి వద్ద ఉండగా.. దసరా పండుగకు బాలిక తల్లి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ పలుమార్లు అత్యాచారం చేశాడు. అప్పటి నుంచి వేధింపులు కొనసాగుతుండగా చివరకు తాళలేక బాలిక తల్లికి చెప్పింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215